

సబ్సిడీ రుణాలు అంతేనా?

- తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రభుత్వం
- లబ్ధిదారుల నిరీక్షణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లు బలోపేతం చేస్తామంటూ పెద్ద ఎత్తున సబ్సిడీ రుణాల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఇదే తరహాలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్సీ,, బీసీ అర్హులైన లబ్ధిదారులు బ్యాంకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ నోటిఫికేషన్ జారీ చేసింది.

గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా ఎలాంటి సబ్సిడీ రుణాలకు నోచుకోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఒక కుప్పం నియోజకవర్గంలోనే బీసీ రుణాల కోసం 300కు పైగా దరఖాస్తులు అందాయి. అభ్యర్థుల ఇంటర్వ్యూలను కూడా పూర్తి చేసినా బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరుకు సిద్ధమవుతున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం రుణాల మంజూరుకు బ్రేకులు వేసింది. తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా అధికారులకు ఆదేశాలందాయి.

చిత్తూరు జిల్లాకు 2,800 బీసీ రుణాల యూనిట్లు మంజూరు అయ్యాయి. సబ్సిడీ రుణాల కోసం ప్రభుత్వం రూ.61.25 కోట్లు మంజూరు చేసింది. ఎస్సీల సబ్సిడీ రుణాల కోసం రూ.27.43 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. గత ఆరు సంవత్సరాలుగా సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు ప్రభుత్వం ఒక్కసారిగా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామంటూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. సబ్సిడీ రుణం మంజూరు అయితే దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్లానింగ్ చేసుకోవడంతో పాటు సబ్సిడీ రుణాలు పొందేందుకు స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీ , బీసీ మైనార్టీ కార్పొరేషన్ అధికారులపై పెద్ద ఎత్తున ఒత్తిళ్లు పెరిగాయి. అర్హుల ఎంపిక పూర్తయి నేడో, రేపో సబ్సిడీ రుణాల అందుతాయని ఆశించిన లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడంతో నిరాశతో ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని లబ్ధిదారుల ఆశలు నెరవేర్చాల్సి వుంది.



'హంద్రీ-నీవా' రాయలసీమకు వరం

నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి -వి కోట : హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు రాయలసీమకు ఓ వరమని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దాసార్లపల్లి వద్ద నిర్వహిస్తున్న 'హంద్రీ -నీవా' సుజల స్రవంతి రెండవ దశ కుప్పం ఉపకాలువ పనులను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డితో కలసి మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. జూన్ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు ఆయన వివరించారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి హంద్రీ-నీవా అంశంలో చేసిన స్టంట్‌లపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. ప్రతివారం సంబంధాలు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. హంద్రీ-నీవా కాలువ పరివాహ ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరిన ప్రాంతాల్లో చెరువులకు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధ అధికారును సమన్వయ పరుచుకుని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డిఓ భవాని, జిల్లా టిడిపి అధ్యక్షులు సి ఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, వి కోట మండల నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్ గౌడు, సోమశేఖర్, శబరీష్, మహిళా అధ్యక్షురాలు శివకుమారిలతో పాటు ఇరిగేషన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

సిమెంట్ వరలు తొలగించండి



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సిమెంట్ వరలను తొలగించాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. మండలంలోని బంగారుపాలెం అరగొండ రహదారులు పాత పాల సేకరణ కేంద్రం ముందు సిమెంట్‌తో తయారు చేసిన వరలను అక్కడే వదిలిపెట్టారు. గత కొంతకాలంగా అవి ఇక్కడే ఉన్నాయి. ఎవరు తయారు చేసి వదిలిపెట్టారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సిమెంట్ తో తయారు చేసిన వరలు తొలగించాలని రహదారికి సమీపంలో ఉండడం వల్ల వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు



ఆస్పత్రి రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశం

ప్రజాశక్తి- రొంపిచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖను బలోపేతం చేస్తూ చర్యలు చేపట్టతోందని అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తోపాటు మంత్రి పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి ఆకస్మిక తనిఖీలో భాగంగా రోజువారి ఓపి వివరాలు, అందుబాటు లో వున్న మందుల వివరాలు, 108,104 వాహనం ద్వారా అందించే సేవలు, అత్యవసర సమయాలలో అందించే వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సేవలు అందించేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు వచ్చే రోజువారి ఓపి రిజిస్టర్ ను పరిశీలించి రోగులకు సంబంధించిన సమగ్ర వివరాలను వారి ఆరోగ్య సమస్యలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. డాక్టర్లు వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్న నమ్మకం మరింత పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉయ్యాల రమణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసిసిబి బ్యాంక్ మేనేజర్‌గా గోమతి



డిసిసిబి బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వి గోమతి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు డిసిసిబీ బ్యాంక్ మేనేజర్‌గా వి గోమతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇంతకుముందు ప్రధాన బ్యాంక్ ఆఫీసులో మేనేజర్ గా పనిచేస్తూ బదిలీపై గంగాధర నెల్లూరు బ్యాంకుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ మహేష్ చిత్తూరు గాంధీ రోడ్ లోని బ్రాంచ్ కు బదిలీ అయ్యారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాల్లోని గొర్రెల పెంపకం దారులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకం దారుల సొసైటీ అధ్యక్షులు వాడ గంగరాజు కోరారు. చిత్తూరు జిల్లా గొర్రెల పెంపకం సహకార జిల్లా యూనియన్ కార్యాలయంలో ఛైర్మన్ ప్రకాష్ యాదవ్ అధ్యక్షతన గొర్రెల పెంపకం దారుల సొసైటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకం దారుల సొసైటీ అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంపకం దారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా సహకార యూనియన్ సమావేశానికి వచ్చే వారికి రవాణా సౌకర్యం కల్పించాలని, సొసైటీ అధ్యక్షులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యాభై సంవత్సరాలు అయిన వారికి పింఛన్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకం దారులకు ప్రభుత్వ జీవో ప్రకారం బంజర భూములు కేటాయించి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం వెంటనే సొసైటీ నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఛైర్మన్‌కు వినతి పత్రం అందించారు. జిల్లాలో పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఛైర్మన్‌కు అందించారు. ఛైర్మన్ స్పందిస్తూ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యక్షులు వాడ గంగరాజు

లక్ష్మీపురంలో దాహం దాహం!

- బోరు బావిలో తగ్గిన నీటిమట్టం
- చాలీచాలని నీటితో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని 42 కుటుంబాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. గతంలో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోరుబావిలో నీటి మట్టం తగ్గి నీరు పుష్కలంగా రాకపోవడంతో పంచాయతీ వారు బోరు వద్దే నీటిని పట్టుకునే ఏర్పాటు చేశారు. అయితే బోరు నుండి నీరు సన్నగా కారుతూ ప్రజలకు సరిపడ నీరు రావడం లేదు. దీంతో గ్రామంలోని చిన్న పెద్ద, మహిళలు, పురుషులు అందరూ బిందెలు చేత పట్టుకుని బోరు వద్దకు వచ్చి సన్నగా వస్తున్న నీటిని గంటలు తరబడి నిరీక్షించి పట్టుకుని ఇళ్లకు తీసుకువెళుతున్నారు. దీనిపై సర్పంచి రెడ్డెప్పను విలేకరి ఫోన్ ద్వారా సంప్రదించగా బోరు బావిలో నీటిమట్టం తగ్గిందని అదనపు పైపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు అవసరమైన తాగునీరు అందించవచ్చని తెలిపారు. శనివారం అదనపు పైపులు బోరులో దించి ప్రజలకు తగినంత తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.



నేడు 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వేసవి కాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా పంచాయతీ, మున్సిపల్ పరిధిలో కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం డిపిఓ సుధాకర్ రావుతో కలసి జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత నుండి రక్షించుకోవడంలో భాగంగా ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు వారి కార్యాలయం పరిధిలో ఐదు నుండి పది మొక్కలు నాటి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిపిఓ జిల్లా స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని ఆదేశించారు. కనీసం 2 వేల మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం మే నెలాఖరు వరకు కొనసాగించాలన్నారు. మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ ఎక్కువ ఉన్న ప్రదేశాలలో, బస్ స్టాప్ లు, కూరగాయలు అమ్మే ప్రదేశాలలో షామియానాలు, టెంట్ లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, చలివేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ ఉండాలని సూచించారు. పెరుగుతున్న ఎండ తీవ్రత కారణంగా తీసుకోవల్సిన జాగ్రత్తల పై లోకల్ టివి చానళ్లు, ఆటోలపై పోస్టర్లు, తదితరాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ : కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. డెంగీ నివారణ దినోత్స వం సందర్భంగా నగరపాలక పరిధిలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే రోగాలు, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని తొట్టెలు, కుండీలు, ఇతర నిరుపయోగ పాత్రలో నీరు నిల్వచేరకుండా చూడాలన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పలు గృహాలను తనిఖీ చేసి నిల్వ నీటిని తీసివేయించారు. లార్వా నిరోధానికి ఆయిల్ బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టరు లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, ఏఎన్ఎం, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి టు డిపోలో మార్క్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా మాక్ డ్రిల్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ, వైద్య శాఖల అధికారు లు శుక్రవారం చిత్తూరు ఆర్‌టిసి -2 డిపోలో మాక్ డ్రిల్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా విపత్కర పరిస్థితులలో ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడం, క్షతగాత్రులకు వీలైనంత తొందరగా వైద్య సహాయం అందించడం, ఇతర చర్యల పై పోలీస్, అగ్నిమాపక, వైద్య శాఖ ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసే విధానంను అధికారులు ప్రజలకు వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ చుట్టు పక్కల ప్రదేశాలలో అనుమానించదగ్గ వ్యక్తులు, వస్తువులు ఉంటే వెంటనే పోలీస్ అధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అడిషనల్ ఎస్‌పి కృష్ణ కిశోర్, ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుమప, డిఎంఅండ్ హెచ్ ఓ సంధ్యారాణి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, చిత్తూరు ఆర్టిసి -2 డిపో మేనేజర్ దీప్తి, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

- ఏప్రిల్‌లో మొత్తం తొమ్మిది శిశు మరణాలు
- 'జిల్లా శిశు మరణాల టాస్క్ ఫోర్స్ కమిటీ రివ్యూ' సమావేశంలో వెల్లడి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గర్భిణులకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని వైద్యాధికారులు సూచించారు. గత ఏప్రిల్ నెలలో జిల్లాలో మొత్తంతొమ్మిది శిశు మరణాలు సంభవించాయని 'జిల్లా శిశు మరణాల టాస్క్ ఫోర్స్ కమిటీ రివ్యూ' సమావేశంలో వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో 'జిల్లా శిశు మరణాల టాస్క్ ఫోర్స్ కమిటీ రివ్యూ' నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో సమీక్ష' నిర్వహించింది. డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ గర్భిణులు కాన్పు సమయంలోకాని, పుట్టిన తర్వాత ఒక సంవత్సరం లోపు చనిపోయే పిల్లలు శిశు మరణాల కిందకు వస్తుందన్నారు. ఏప్రిల్ నెలలో మొత్తం తొమ్మిది మరణాలు కాగా అవి ఏడు పిహెచ్‌సిలలో ఎనిమిది శిశు మరణాలు ,1 అర్బన్ హెల్త్ సెంటర్‌లో నమోదయ్యాయన్నారు. ఇవన్నీ హాస్పిటల్‌లో మరణించినవే అన్నారు. గర్భస్థ సమయం నుంచే ఎలాంటి పౌష్టికాహార లోపం లేకుండా బిడ్డకు ఉండేందుకు మొదటి నుంచి జాగ్రత్తలు తీసుకునే విధంగా యాక్షన్ ప్లాన్ వేసుకొని సేవలు అందించాలని టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. బిడ్డ పుట్టినప్పటినుంచి బిడ్డకు ఇవ్వవలసిన వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో ఇచ్చినట్లయితే అంటూ వ్యాధులు ప్రబలకుండా బిడ్డ ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ ,డాక్టర్ లత, డాక్టర్ అనిల్ బాబు , డాక్టర్ ప్రశాంతి , డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సింధూర, వెంకటేశ్వరి ,మోహన్ బాబు పాల్గొన్నారు.




శిశు మరణాలపై సమీక్షిస్తున్న జిల్లా శిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు

ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత యువతదే

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలో వక్తలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తీవ్ర సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతదేనని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పిలుపునిచ్చారు. 17వ మహాసభల సందర్భంగా తిరుపతి కనం రాజేంద్రన్ హాలులో ప్రతినిధుల సభను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సభకు సుఖ్‌జిందర్ మహేసరి, వలీ ఉల్లాఖాద్రి, అరుణ్, లెనిన్, ఆర్తి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన వారికి సంతాపసూచికగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.నారాయణ అధ్యక్షోపన్యాసం చేశారు. జస్టిస్ చలమేశ్వర్ ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను తమ భుజస్కందాలపైకి ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ యువ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. 13 నెలల పాటు జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళనలో పెద్ద సంఖ్యలో యువ రైతులు పాల్గొన్నారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వాల వైఫల్యం ఉందన్నారు. రైతుకు మద్దతు ధర లేదని, శ్రమకు తగిన ఫలితం లేదన్నారు. అఖిల భారత ఆర్‌వైఎ ఉపాధ్యక్షు లు సుందం రాజన్ మాట్లాడుతూ యువతను కార్పొరేట్లకు అమ్మే స్తున్న మోడీ, దేశ సార్వ భౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎల్ జాతీయ నాయకులు బి.జగదీష్ కుమార్, ఎఐటియుసి జాతీయ కార్యవర్గ సభ్యులు బివివి కొండలరావు, బికెఎంయు జాతీయ అధ్యక్షులు పెరియార్ స్వామి పాల్గొన్నారు.



జస్టిస్ జాస్తి చలమేశ్వర్



నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

వైద్య సిబ్బంది కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -కార్వేటినగరం: వైద్య సిబ్బంది గురువర్మ(52) గత కొన్నాళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కార్వేటినగరానికి చేరుకుని గురువర్మ మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గురువర్మకు నివాళులు అర్పించిన వారిలో ఎంపీపీ లతబాలాజీ, మాజీ జడ్పీటీసీ దేవకీ లోకనాధరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ. ఉప సర్పంచ్ శేషాద్రి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు. విశ్రాంతి జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి డాక్టర్ రవిరాజు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడుకి స్వాగతం పలుకుతున్న అధికారులు, నాయకులు

మంత్రి కి ఘన స్వాగతం

ప్రజాశక్తి -శాంతిపురం: 'హంద్రీ-నీవా సుజల స్రవంతి' రెండవ దశ కుప్పం ఉప కాలువ పనులను పరిశీలించేందుకు శుక్రవారం సాయంత్రం చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గం శాంతిపురానికి చేరుకున్న రాష్ట్ర జన వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి ఎస్ మునిరత్నం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హంద్రీ-నీవా జలాలను పాలారు నదికి అనుసంధానం ఏ విధంగా చేస్తారన్న విషయాన్ని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు కుప్పం ఆర్డీఓ శ్రీనివాస రాజు, కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగ మాంబ దేవస్థానం ఛైర్మన్ రవిచంద్రబాబు, నాయకులు, డాక్టర్ సురేష్ స్వాగతం పలికారు.



వైసిపి కార్యకర్తకు నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

వైసిపి కార్యకర్తకు నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి 49 కొత్తపల్లి మిట్ట కు చెందిన వైసిపి కార్యకర్త దాసరి సంపంగి (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయనకు భార్య ఏకాంబరం, కొడుకు మాధవన్, కూతురు అర్చన ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంసీ విజయానంద రెడ్డి తో పాటు పలువురు నాయకులు శుక్రవారం ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, విజయానంద రెడ్డి వైసిపి కార్యకర్త సంపంగి కొడుకు మాధవ, కుటుంబ సభ్యులను ఓదా ర్చి వారికి ధైర్యం నింపా రు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య , నాయకులు గురువారెడ్డి విజయబాబు, కుప్పయ్య , జనార్ధన్, యేసు రత్నం, స్కైలా రెడ్డి గోవిందరెడ్డి, కోటిరెడ్డి బాబు, రిటైర్డ్ టీచర్ దొరస్వామి, హరి రెడ్డి, భాస్కర్, అదిశయరాజు, కనికరాజు, శ్యాము చిట్టి మహేష్ , మణి పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి రొంపిచర్ల : రొంపిచర్ల మండలం బండకింద పల్లి గ్రామంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ రొంపిచర్ల మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఊటుకూరు మదన్ మోహన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ అవకాశం కల్పించిన పుంగనూరు టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. టిడిపి కోసం శక్తి వంచన లేకుండా సాయి శక్తుల పనిచేసే పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో వి అమర్నాథరెడ్డి, కె రామయ్య, పి నౌషాద్ ఖాన్, ఎస్ జహీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైభవంగా ద్రౌపది, ధర్మరాజుల కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం : ద్రౌపదీ సమేత ధర్మరాజు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కొత్తపల్లి, 49 కొత్త పల్లి మిట్ట , కొటార్లపల్లి , 48 బసివిరెడ్డిపల్లి గ్రామ ప్రజల సమక్షంలో పురోహితులు కార్తికేయ అయ్యగార్లు సమేత ధర్మరాజుకు పూలమాలలతో అలంకరించి ప్రధాన హోమం నిర్వహించి వేద పండితుల మధ్య మంగళవాయిద్యాల మధ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి శెంజి వారి వంశస్థులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సంపూర్ణమ్మ, పురుషోత్తం, లక్ష్మి ఉభయ దారులుగా వ్యవహరించి సంప్రదాయబద్ధంగా ఆరివేమను తీసుకువచ్చి వివాహ వేదిక పురోహితుల వేదమంత్రాల మధ్య పెళ్లి తంతు ముగించారు. పరిసరాల ప్రాంతాల్లో గ్రామ ప్రజలు అమ్మవారికి అక్షింతలు వేశారు. మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు మధ్యాహ్నం ద్రౌపదీ కల్యాణం హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమానికి శెంజి వారి వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగరాజు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణంలో ఆలస్యం

- అధికారుల నిర్లక్ష్య వైఖరి - అన్నీ పూర్తికాని వైనం - అందుబాటులోకి తేవాలని మండల వాసుల వినతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాలలో పశువుల దాహార్తిని తీర్చడానికి అనువైన చోట నీటి తొట్టెలను నిర్మించాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిర్మాణ పనులను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టింది. నీటి నిర్మాణంలో జాప్యం చేయడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్తంగా పల్లె పండుగ 2025-26 ద్వారా నీటి తొట్టెల నిర్మాణపు పనులు చేపట్టాయి. క్షేత్ర స్థాయిలో కొంతమంది ఉద్యోగుల నిర్లక్ష్యంతో మండలంలో ఈ నీటి తొట్టెల ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.. అవసరమైన చోట మండల అభివృద్ధి అధికారి, వారి సిబ్బంది 33 పశువుల తొట్టెలు అవసరమని పై స్థాయి అధికారులకు నివేదిక పంపించారు. అవి మంజూరయ్యాయి. ఒక్కొక్క తొట్టికి నిర్మాణ వ్యయం కింద 33,011 రూపాయల నిధులు కేటాయించింది. మండలంలో ఇప్పటివరకు 24 నీటి తొట్టెలు పూర్తయ్యాయి. మిగిలిన తొమ్మిది తొట్టెలు పనులు ముందుకు సాగడంలేదు. ఒక్కొక్క తొట్టెను మూడు లేక నాలుగు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేయవచ్చునని స్థానికులు అంటున్నారు. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. అధికారులు నిర్లక్ష్యం అని పాడి రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువుల దాహార్తిని తీరుస్తున్న నీటి తొట్టెలు



పాడి రైతులు తమ పశువులను దాహార్తిని తీర్చడానికి ఈ నీటి తొట్టెలు ఉపయోగపడుతున్నాయి. మేత కోసం పశువుల ఇతర ప్రాంతాలకు వెళ్లి మేత మేసి తిరిగి వచ్చేటప్పుడు మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ఈ నీటి తొట్టెల ఏర్పాటు చేపట్టారు. మండలంలో అసంపూర్తిగా వున్న నీటి తొట్టెల నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం...

- ఎల్ పురుషోత్తం ఎంపీడీవో, వెదురు కుప్పం మండలం.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలతో జిల్లా ఉపవైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ , జిల్లా మలేరియా అధికారి శ్రీ వేణుగోపాల్ గారి సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు చిత్తూరు అర్బన్ పరిధిలోని టీ.చవట్టపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ ఏరియాలో "జాతీయ డెంగీ దినోత్సవం"అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జాతీయ డెంగీ దినోత్సవం థీమ్ 'మూడు పద్ధతులు (పరిశీలించండి, శుభ్రపరచండి, మూతలు పెట్టండి)పాటిద్దాం -డెంగీ ని ఒడిద్దాం "అని ప్రభుత్వం పిలుపు నిచ్చిందన్నారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతై ప్రతీ శుక్రవారం డ్రై డే గా పాటిస్తూ, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచుకొని నీటి నిల్వల పైన మూతలు ఉంచాలని ఈ విధమైన చైతన్యం ప్రతీ ఇంటిలో రావాలని వచ్చే విదంగా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.హెచ్.ఓ డాక్టర్ లోకేష్, డాక్టర్ దిలీప్, డాక్టర్ ఆశ, డాక్టర్ సాయి గౌతమ్, జయరాముడు, రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తవణంపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవు తుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భం గా తవణం పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తవణం పల్లె పుర వీధులలో వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించి



తవణంపల్లిలో

అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి ప్రియాంక డాక్టర్ పి కేశవ నారాయణ, డాక్టర్ టిఎస్ మోహన వేలు, సబ్ యూనిట్ ఆఫీసర్ శివ సుబ్రమణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు డి రాజశేఖర్, శ్రీహరి, నిర్మలమ్మ, రెడ్డమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏ ఎన్ఎమ్ లు, ఆశ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

గుడిపాల: డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి సంధ్య పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లా డుతూ డెంగీ జ్వరాల ముప్పు నుంచి జాగ్రత్తగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, హెల్త్ సూపరువైజర్, విజయ, ఏఎన్ఎం సెల్వి, చంద్రశేఖర్, ఆశ పాల్గొన్నారు.



గుడిపాలలో

యాదమరి: 'దోమలను అరికడదాం.. డెంగీ నుండి ప్రజలను కాపాడుదాం' అని నినాదాలు చేస్తూ జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ర్యాలీ నిర్వహించారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని దోమలను నివారించాలని సూచిం చారు. డెంగీపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినయ్ మాట్లాడుతూ దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రత పాటించాలని అన్నారు. మురుగునీటి కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , తద్వారా దోమల అభివృద్ధిని అరికట్టవచ్చునని అన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రామకుప్పం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతో దోమలు నివారణ చేపట్టి డెంగీని పూర్తిగా నిర్మూలించవచ్చని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక వైద్యులు పూజిత పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ డెంగీ దినోత్సవం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో చెత్త, నీటి నిల్వలు లేకుండా, పరిశుభ్రత పాటించాలన్నారు. వేపాకుతో పొగ, దోమ తెరలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు అందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగభూషణం,కుమార్ , హెల్త్ అసిస్టెంట్ బాలు, చంద్రమణి, ప్రమీల, రోజా రాణి, ప్రభావతి, భాను ప్రకాష్ ,శైలజ, ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.




రామకుప్పంలో

ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీ హరిత విప్లవానికి బ్లూ ప్రింట్

- తండ్రికి తగ్గ తనయుడు మంత్రి నారా లోకేష్
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ పాలసీ హరిత విప్లవానికి బ్లూ ప్రింట్ అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని రాయలసీమలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. రి న్యూ పునరుత్పాదక ఇంధన కాంప్లెక్స్ ఏర్పాటుతో సీమకు మహర్దశ పట్టనుందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజక వర్గం, బేతపల్లిలో 22 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న రి న్యూ ఎనర్జీ కాంప్లెక్స్ కు శుక్రవారం మంత్రి నారా లోకేష్ బాబు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా లోకేష్ బాబుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఏపీలో ఉత్పత్తి అయ్యే ప్రతి మెగావాట్ విద్యుత్ ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుందని, భారతదేశాన్ని ముందుండి నడిపించే శక్తి రథానికి ఆంధ్రప్రదేశ్ సారథ్యం వహిస్తుందన్నారు. భారతదేశంలో గ్రీన్ పవర్ హౌస్‌గా మారుతున్న ఆంధ్రప్రదేశ్ పై నమ్మకంతో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన రి న్యూ చైర్మన్, సిఇఓ సుమంత్ సిన్హాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో.. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ , రిన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందన్నారు. లోకేష్ కృషి ఎనలేదని, తండ్రికి తగ్గ తనయుడుగా మంత్రి లోకేష్ అడుగులేస్తున్నారని చిత్తూరు ఎంపీ కొని యాడారు. పునరుత్పాదక ఇంధన పెట్టుబడులకు సంబంధించి 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనే లక్ష్యంగా లోకేష్ ముందుకు సాగడం అభినందనీయ మన్నారు. ఆంధ్రప్రదేశ్ పై నమ్మకంతో పాటు గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల సాధనకు ఏపీ సిద్ధంగా ఉందనడానికి ఇదో నిదర్శనమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేస్తుందని పేర్కొన్నారు.



నారా లోకేష్‌తో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు (ఫైల్ ఫొటో)

.టిడిపి మండల కన్వీనర్‌గా దొరబాబు



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతల పట్టు మండలం టిడిపి మండల కన్వీనర్‌గా పేట అగ్రహారం గ్రామానికి చెందిన దొరబాబు చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో భాగంగా ఆయనను ఎన్నుకున్నారు. గతంలోనూ ఈయన కన్వీనర్‌గా ఉన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే నాయకునికి తిరిగి పట్టం కట్టడం ఆనందదాయకమని మండల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విపత్తులను ఎదుర్కొందాం: ఆర్‌డివో

ప్రజాశక్తి -విజయపురం(నగరి): విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొందామని ఆర్డీవో భవానీ శంకరి, డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణ ప్రజలకు విపత్తు నిర్వహణపై వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపత్తు అన్నది భూకంపాల ద్వారా గానీ, తుపాను రూపంలో గానీ, వరదల రూపంలో గానీ, అగ్ని ప్రమాదం రూపంలో గానీ, యుద్ధాల ద్వారా గానీ రావచ్చని విపత్కర, సంక్షోభపరిస్థితులు ఎదురైతే.. ప్రభుత్వం ఎలాంటి సహాయ చర్యలు తీసుకుంటుంది. వివిధ ప్రభుత్వ శాఖలు ఎలా సమన్వయం చేసుకుంటాయి, సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారనే అంశాలను వివరించారు. జనాభా ఎక్కువగా ఉన్న అపార్టుమెంట్లలో విపత్తు సమయంలో నష్టాలు ఎక్కువ ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ సమయంలో ఎలాంటి పద్ధతులను అవలంబించాలన్న అంశాలను ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది ద్వారా ప్రత్యక్షంగా చేయించి కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రస్తుతం యుద్ధాలు, బాంబులు పడటం అన్నవి లేకపోయినా వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన ప్రాంతంలోకి ఏవైనా బాంబుల ప్రయోగం జరిగితే ముందస్తు సమాచారం అందుతుందని ఆ వెంటనే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగుతుందన్నారు. సైరన్ మోగగానే ఏ మాత్రం ఆందోళన, భయం లేకుండా వ్యవహరించాలని మైదానాలున్న ప్రాంతాలకు గానీ, అందుబాటులోని షెల్టర్లకు గానీ వెళ్లిపోవా లన్నారు. మళ్లీ సైరన్ మోగేదాకా అలానే ఉండాలన్నారు. వైద్యులు మహేష్, కార్తిక్ ప్రమాదాలు జరిగిన సమయంలో చేపట్టాల్సిన ప్రథమ చికిత్స గురించి, అవసరాలకు అందుబాటులో ఉంచుకోవాల్సిన మందుల గురించి వివరించారు. వీరజవాన్లకు మౌనం పాటిస్తూ అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వెంకటముని, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వినతులు సకాలంలో పరిష్కరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజల వినతులు సకాలంలో పరిష్కరించాలని మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను నిర్వహించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు మరమ్మతులు వంటి సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరిం చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 24 వినతులు అందాయి. ప్రజల నుంచి అందిన వినతులను ఆన్ లైన్లో సంబంధించిన శాఖల అధికారులకు పంపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా అందిన వినతులను సకాలంలో విచారించి, పరిష్కరించి నివేదికలు సమర్పిం చాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సహాయకులు కుమార స్వామి యాదవ్, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఎంఈ వెంకట రామి రెడ్డి, రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ ఇబ్రహీం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న చిత్తూరు నగర కమిషనర్ నరసింహప్రసాద్

బిసి కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: బిసి కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి కృష్ణమ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని తూగుండ్రం గ్రామంలో నూతన దుస్తుల దుకాణం శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం బిసి కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ దుస్తుల దుకాణం బీసీ కార్పొరేషన్ లోన్‌లో మంజూరైనట్లు యమునా రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో తూగుండ్రం సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుమన్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, జిల్లా టిడిపి టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షుల రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్, మాజీ సర్పంచ్ అశోక్ నాయుడు, మాజీ తూగుండ్రం పీహెచ్‌సి ఛైర్మన్ నరసింహులు నాయుడు, మండల టిడిపి మాజీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు శ్రీనివాసులు శెట్టి, టిడిపి నాయకులు శివకుమార్, అతేహర్ పాల్గొన్నారు.



దుస్తుల దుకాణం ప్రారంభిస్తున్న జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు

అభివృద్ధి పనులపై చొరవ చూపాలి

ప్రజాశక్తి -వి కోట : అభివృద్ధి పనులపై చొరవ చూపి త్వరిత గతిన పరిష్కరించాలన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికారులతో శుక్రవారం సమీక్షించారు. స్థానిక ఆర్ అండ్‌బి అతిథి గృహంలో రెవెన్యూ , మండల పరిషత్, ఇంజనీరింగ్ అధికారులతో విడివిడి గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలు మండల పరిధిలో తాగునీటి బోర్ల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ప్రభుత్వపరంగా చేపట్టి జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. గత వైసిపి ప్రభుత్వం లో చేపట్టిన భూ సర్వేలులో చోటు చేసుకున్న అవకతవ కలను సరిచేయాలని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో వి కోట మండలానికి మంజూరైన బైపాస్ రోడ్డు పనులు కర్ణాటకా మీదుగా జరగడాన్ని అడ్డు కోవాలని స్థానిక ప్రజలు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశం లో తహశీల్దారు ఉదయ్ సంతో ష్, ఎంపీడీవో ఈశ్వం ´న్, ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు నాయుడు, ఈశ్వర్ గౌడ్, పొట్టి భాస్కర్, ధీరజ్, శబరిష్ పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్తు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ ఆదేశం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లాలో త్వరలో నిర్వహించనున్న 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఓపెన్ స్కూల్ ఇంటర్, 10 వ తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించనున్న పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలకు 36 పరీక్షా కేంద్రాలలో 8,765 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అడ్వాన్స్‌డ్ ఓపెన్ స్కూల్ ఇంటర్, 10 వ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అడ్వాన్స్‌డ్ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 9 పరీక్షా కేంద్రాలలో 2,182 మంది విద్యార్థులు, 10 వ తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు 12 పరీక్షా కేంద్రాలలో 670 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షా సమయంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను, ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, రవాణా ఏర్పాట్లు చేయాలని, ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు.



ఆదర్శ రైతులను సన్మానిస్తున్న వ్యవసాయ శాఖా సిబ్బంది

రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభం

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖా సిబ్బంది పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ప్రతి రైతుకు అవగాహన తోనే అధిక దిగుబడుల తో లాభాలు సాధించవచ్చని తెలిపారు. ప్రకృతి కల్పించిన చెట్ల ద్వారా కషాయాలతోనే పంటలకు పిచికారి చేయవచ్చని తెలిపారు. కూరగాయల సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు, సుబ్బన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయప్ప పాల్గొన్నారు.

క్లిష్టమైన లక్షణాలు గుర్తించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి జిల్లాలోని డాక్టర్స్ అందరికి కాన్పు సమయంలో సంభవించే ఎక్లాంప్సియా(క్లిష్ట పరిస్థితుల) పై జూమ్ ద్వారా శిక్షణ నిర్వహించారు. ప్రీ ఎక్లాంప్సియా ఉన్న గర్భిణీలలో ఎక్లాంప్సియా సంభవించే మూర్ఛలు, వీటి లక్షణాలు సాధారణంగా అధిక రక్తపోటు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, మూర్ఛలు. ఎక్లాంప్సియా అనేది గర్భధారణ రెండవ భాగంలో సంభవించే అరుదైన తీవ్ర పరిస్థితి అని, వీటిని ఎలా మేనేజ్ చేయాలి? అనేది డాక్టర్స్ తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. అప్పుడే మనం మాతా మరణాలు జరగకుండా నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ అనూష, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి (సిహెచ్‌సి)ని జడ్పి చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో అడ్మిషన్ లో ఉన్న పేషెంట్లతో పాటు ఔట్ పేషెంట్లతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. డ్యూటీ షెడ్యూల్ ప్రకారం కేటాయించబడిన వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలో కచ్చితంగా అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు హేమంత్ కుమార్, రెడ్డి, మాజీ హాస్పిటల్ చైర్మన్ చంగారెడ్డి, కౌన్సిలర్ రాజేష్ ,పాల్గొన్నారు.

22 లోపు పాఠశాలలో చేరాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూళ్లలో , 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 22 చివరి తేదీ అని ఆ పాఠశాల ప్రిన్సిపల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కమ్మనపల్లి ఆంధ్ర ప్రదేశ్ మోడల్ స్కూలులో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుకునే విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు మండలంలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించుకుని వారి పిల్లల భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గంగ జాతర

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో గత నెల 30వ తేదీ గంగ జాతర చాటుతో ప్రారంభమైన గంగ జాతర విశేషంగా వినోదంగా విభిన్న రీతిన ప్రశాంతంగా గంగమ్మ జలధి కార్యక్రమంతో శుక్రవారం ఉదయం 9 గంటలకు ముగిసింది. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు స్థానిక గంగమ్మ ఆలయం నుండి ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవారి శిరస్సు, గంగమ్మ గుడి వీధి బజారు వీధి జిలాని సర్కుల్ గాంధీనగర్ మీదుగా ప్రజలకు దర్శనమిస్తూ ఆర్టీసీ డిపో వెనుక వైపు ఉన్న బావిలో నిమజ్జనం చేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, డప్పుల మధ్య అమ్మవారి వేషధారణ నృత్యాలు అలరించాయి.

అధికారులకు ఎంఎల్‌ఏ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే